# సత్యాగ్రహం

నాకొక సినిమా ప్రొడ్యూసరు మిత్రుడున్నాడు. అతడు వ్యాపారాన్ని కళగాను, కళను వ్యాపారంగానూ నడుపుతూ ఉంటాడు. అందుచేత నాకు అతనంటే గౌరవం. ఓ మాదిరి వ్యాపారస్థులు తమ కిందపని చేసేవారి శ్రమను శక్తిమాత్రమే కొంటారు, కాని నా మిత్రుడు మనుష్యులను కూడా కొంటాడు. అతనికి అమ్ముడు పోవటంలో ఏదో ఆనందం ఉండి ఉండాలి. లేకపోతే అమ్ముడు పోదామని అంతమంది తహతహ లాడరు.

నా ప్రొడ్యూసరు మిత్రుడికీ నాకూ చాలా విషయాలలో అభిప్రాయాలు కలియవు. బాగుపడే గీత లేని వాణ్ణి కావటం చేత నేను ఒకే తాటిమీద నడుస్తూంటాను. అతను బాగుపడే గీతగలవాడు కనక కప్పదాట్లు వేస్తూ ఉంటాడు. ఉదాహరణకి, అతను ఎప్పుడు వ్యాపారాన్ని కళ అంటాడో, ఎప్పుడు కళను వ్యాపారమంటాడో నేను చచ్చినా ఊహించలేను.

తాను పెట్టుబడిదారు కావటమే లోకానికి ఉద్ధరింపని ఒకసారి అంటాడు. తన లాభాల కోసం దేశమంతా నష్టపడినా ఫరవాలేదంటాడు మరోసారి. పైపెచ్చు ఈ రెండూ రెండు సిద్ధాంతాలు కావంటాడు.

అయినా నాకతనంటే గౌరవం ఎందుచేతనంటే అతను ఎవరూ చేయలేని పనులు కొన్ని చెయ్యగలడు. ప్రభుత్వాన్ని గడ్డిపోచకింద లాగి పారెయ్యగలడు. తాను చిత్రాల ద్వారా "ఎంటర్టెయిన్మెంట్" ఇస్తున్నానంటూ ఆ చిత్రాలలోనే, అత్యవసర సమస్యలు ఎదుర్కొంటూ ప్రభుత్వం చేసే ఏర్పాట్లను దుమ్మెత్తిపొయ్యగలడు. అతని చిత్రాలు సెన్సారుకు వచ్చే సమయానికి సెన్సారు సభ్యులు "ఏడవ స్వర్గంలో ఉంటారల్లే ఉంది: పడవలసినచోట కూడా కత్తెర పడదు.

ఇండియాలో తయారయే చిత్రాల పొడుగు పరిమితం చెయ్యాలా అన్న సమస్యను గురించి రాయవలసిందని నన్నొక పత్రిక వారు కోరారు. చిత్రాల పొడుగు పరిమితం చెయ్యవలసిందేనంటూ వ్యాసం రాసి జేబులో పెట్టుకుని నా ప్రొడ్యూసరు మిత్రుడి దగ్గిరికి వెళ్లాను. ఆయన నా వ్యాసం చూసి, "నువ్వు చాలా పొరపాటుపడ్డావు." అన్నాడు.

"నేనాట్టే పొరపాటు పడ్డాననుకోను. ఈ సమస్య అన్నివేపులనుంచీ ఇందులో చర్చించాను" అన్నాను.

"నీ వాదనలన్నిటికీ నేను సమాధానం ఇవ్వగలను," అన్నాడాయన.

"ముడి ఫిలిము దిగుమతి సరుకు. మనం ఎంత పొదుపుగా వాడుకుంటే మన ఆర్థిక స్థితి అంత బాగా ఉంటుంది. మన సినిమా చిత్రాలు ఎగుమతి సరుకు కాదు."

"నా చిత్రాలు మలయా, సిలోన్, బర్మాలకు పోతాయి."

"సముద్రంలో కాకిరెట్ట."

"అందరికీ సరిపోయే ముడిఫిలిము లేదంటావా?"

"ఉండవచ్చు. కాని దానిని ఎంత తక్కువగా వాడితే అంత మంచిది. మన అంతర్జాతీయ వ్యాపారమంతా తగులు వ్యాపారమే. మన సినిమా కెమెరాలూ, సౌండు ఎక్విప్‌మెంటూ పైనుంచే రావలసి ఉంది. అది అనవసరంగా అరిగిపోవటం మంచిది కాదు."

"పూర్తి అయిన చిత్రాల పొడుగు సంక్షేపిస్తే ముడి ఫిలిము వాడకం తగ్గుతుందనీ, సినిమా పరికరాల అరుగుదల తగ్గుతుందనీ నీకెవరు చెప్పారు? 18 వేల అడుగుల చిత్రానికి పట్టే ఫిలిముకంటె 11 వేల అడుగులకు ఎక్కువ నెగెటివూ, ఎక్కువ సౌండూ పట్టవచ్చు. అది నా అనుభవం."

"ఒక్కడి అనుభవం ఒకసారి ఆ విధంగా ఉండవచ్చు. 300 చిత్రాలమీద చూసేటట్టయితే విధిగా తక్కువ పొడుగు చిత్రాలకు తక్కువ ముడి ఫిలిం పడుతుంది—అందరూ వెర్రివెధవలైతే తప్ప."

"అట్లా అయితే చిత్రాల సంఖ్య తగ్గించుకో వచ్చుగా? ముడి ఫిలిం రేషన్ చేసి ఇస్తే మేం నాలుగు చిత్రాలు తీస్తామో, ఒక చిత్రమే తీస్తామో, మాగోల మాదీ! ఫిలిము పొడుగు తగ్గించాలని పంతమేం?"

"ఇందులో పంతా లేమీ లేవు. ఇదొక సూచన. ప్రభుత్వం వారు తమ జోక్యం లేకుండా మిమ్మల్నే పొడుగు తగ్గించుకోమంటున్నందుకు సంతోషించక, వాళ్ళను ఫిలిం రేషను చెయ్యమంటావెందుకు!"

"ఫిలిం పొడుగు తగ్గించమనటం జోక్యం కాదూ? క్షమించరాని జోక్యం! నా చిత్రం ఇంత పొడుగుండాలీ అని ప్రభుత్వం చెబుతుందా? ఇది కళ! కళ నిరంకుశం! దీనికి ఎవరి హద్దూ ఉండరాదు."

"కాదని హద్దులూ ఉంటూనే ఉన్నాయి. నీ కళ దాని హద్దుల్ని అదే చూసుకుంటున్నదని నేను నమ్మను. పొరపాటునకూడా నీ చిత్రాలు మూడు వేల అడుగులలో ముగియగా నేను చూడలేదు. 30 వేల అడుగులకు పోగాకూడా చూడలేదు."

"నేను తీయదలిస్తే 3 వేల అడుగుల్లో ఇమిడే కథలూ, 30 వేల అడుగులకు పోయే కథలూకూడా ఉన్నాయి."

"11 వేల అడుగుల్లో ఇమిడే కథలేనా లేవు?"

"అవీ ఉన్నాయి. నేను వాటిని తీయను."

"ఏం?"

"ప్రేక్షకులు చూడరు. ప్రేక్షకులకు అక్కర్లేని చిత్రాలు తీసి దివాలా ఎత్తటానికా ఇక్కడ కూచున్నాను? నేను చేసేది వ్యాపారం."

"నీ దింతకూ కళా? వ్యాపారమా?"

"కళా వ్యాపారం."

"ఇదం బ్రాహ్మమిదం క్షాత్రంగానుంది నీ పని. 11 వేల అడుగుల చిత్రాలు చూడరని నీ కెట్లా తెలుసు?"

"డబ్బొచ్చేవి ఎప్పుడూ పొడుగాటి చిత్రాలే. ఎకాడమీ ఎవార్డులన్నీ పొడుగాటి చిత్రాలకే."

"భారీ అయిన కథ ఉండి, కళాదృష్టిలో పొడుగుగా ఉండవలసిన చిత్రాలకు పర్మిషను పుచ్చుకోవచ్చుగా, ప్రస్తుతం కథ లేకుండా పొడుగున్న చిత్రాలు చూసు ఎంత తలనొప్పిగా ఉన్నాయో!"

"ఎవరా పర్మిషనిచ్చేది? ఏ చిత్రానికి పర్మిషనివ్వాలో నిర్ణయించే మగవాడెవడు? చిత్ర నిర్మాణం కళ. ఉక్కు కోటాలూ, సిమెంటు కోటాలూ మంజూరు చేయుటమా?"

"మళ్లీ చిత్రనిర్మాణం కళ అయిందా? నీ కళా చిత్రాలను సెన్సారు చేస్తున్నారే, మాట్లాడవేం?"

"సెన్సారు పద్ధతిమా బాగాలేదు. నేనది బాగుందన లేదు. అయినా దానికీ దీనికీ సాపత్యం లేదు."

"మనం ఇంత సేపు మాట్లాడినా నాకు సరి అయిన సమాధానాలు రాలేదు. చిత్రాల పొడుగు తగ్గటంవల్ల లాభం ఉందనే నాకు తోస్తున్నది. ఈ వ్యాసం పత్రిక కిచ్చేస్తాను. ఒక్క విషయం మాటవరసకు అడుగుతాను. ప్రభుత్వం చిత్రాల పొడుగు తగ్గించవలిస్తే ఏం చేస్తావు?"

"చిత్రనిర్మాణం మానేస్తాను."

"అట్లాగైనా నష్టపడతావు గాని, 11 వేల అడుగుల చిత్రాలు తీసి నష్టపడవన్నమాట."

"పోతున్నావా? ఆ వ్యాసం మాటేమిటి?"

"పత్రిక కిస్తాను."

"అది పత్రికకిస్తే నేను నా వ్యాపారమంతా అమ్మేసి బీదలకు దానంచేసేసి సన్యసించి కొండ గుహలో కూర్చుని తపస్సు చేస్తాను. ఇది ముమ్మాటికీ నిజం!"

నా మిత్రుడు సత్యాగ్రహంలోకి దిగాడు! ఇది పుణ్యభూమి కనక ఇక్కడ పెట్టుబడిదార్లు సత్యాగ్రహం చేయగలరు. నైతికంగా నా మిత్రుడి సత్యాగ్రహం నన్ను జయించేసింది. దాని మహత్తరశక్తి నా హృదయం పరివర్తన చెంది, వెల భక్తిగా నేడి, "మిత్రమా, నే నిందాకటినుంచీ చేసిన వాదంలో గల తప్పులన్నీ గ్రహించాను. నాకు జ్ఞానోదయ మయింది. ఇదుగో ఈ వ్యాసం ఇప్పుడే తగలబెట్టేస్తున్నాను." అంటూ నా వ్యాసానికి నిప్పుపుల్ల వెలిగించి అంటించాను.

"పాపం, పత్రికకు వ్యాసం లేకుండా పోయింది. మళ్లీ కూచుని ఎక్కడ రాసుకుంటావు. ఇది తీసుకుపోయి పత్రికకిమ్ము. అందులో ఏమున్నదీ నువ్వు చూడనుకూడా అవసరం లేదు" అంటూ నా మిత్రుడు నాకొక సైక్లోస్టైలు చేసిన కట్ట ఇచ్చాడు.